ఆన్‌లైన్‌లోనే సెలవు దరఖాస్తులు సమర్పించాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్
- ఉద్యోగులకు శిక్షణ

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ / పాల్గొన్న అధికారులు

కలెక్టరేట్, డిసెంబర్ 28: వచ్చే జనవరి 1 నుంచి అధికారులు ఆన్‌లైన్‌లోనే సెలవు దరఖాస్తులు సమర్పించాలని అదనపు రెవెన్యూ కలెక్టర్ ఎన్ ఖీమ్యా నాయక్ సూచించారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో e- HRM పోర్టల్ ద్వారా సెలవు మంజూరు దరఖాస్తుల నమోదుపై ఉద్యోగులకు నిర్వహించిన శిక్షణలో పాల్గొని, మాట్లాడారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది తమ సెలవు దరఖాస్తులను ఆన్‌లైన్ పోర్టల్ https://e-hrms.gov.in ద్వారా మాత్రమే సమర్పించాలని, తమ పరిధిలోని ఈ-ఆఫీస్ లాగిన్ ఐడీ వినియోగించుకుని ఉద్యోగుల జాబితా, వివరాలను అప్ డేట్ చేయాలని సూచించారు.

పరీక్షల్లో ఒత్తిడికి లోనవ్వద్దు

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మంచాల గణేశ్

చందుర్తి, డిసెంబర్ 28: విద్యార్థులు పరీక్షల్లో మానసిక ఒత్తిడికి లోనుకావద్దని, ప్రశాంతంగా ఉండాలని ఆర్ట్ ఫుల్ నెస్ శిక్షణ నిపుణుడు మంచాల గణేశ్ సూచించారు. శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'పోటీ పరీక్షల్లో భయం' అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు వెళ్తేనే అనుకున్నది సాధ్యమవుతుందని చెప్పారు. పరీక్షల్లో ఒత్తిడిని జయించాలంటే యోగ, ధ్యానంతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదివితే మంచి స్థాయికి చేరుకుంటారని తెలిపారు. ఇక్కడ శిక్షణ నిపుణులు మోహన్, అధ్యాపక బృందం విద్యార్థులు ఉన్నారు.

నల్ల బ్యాడ్జీలు ధరించి '104' ఉద్యోగుల నిరసన

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్ 28: తమ పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా దవాఖాన ఎదుట ఔట్ సోర్సింగ్ 104 ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఉద్యోగులు మాట్లాడుతూ.. ఆరు నెలలుగా 104 ఉద్యోగులకు జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారని వాపోయారు. ఈ సమస్యపై ఉద్యోగ సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి అనేక సందర్భాల్లో వినతి పత్రాలు సమర్పించినా ఫలితం లేదన్నారు. ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదే తప్ప, తమ సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఇక్కడ స్వప్న, చంద్ర శేఖర్, వేణు, రాజీర్, శివ కుమార్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. 8977639662 / 8977639663.
NT-338986-AII

PLOT FOR SALE

★ Hyd. హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, కొహెడ శ్రీమిత్ర, బాటసింగారం, తూప్రాన్‌పేట్, పోచంపల్లి శ్రీమిత్రలో ప్లాట్లు కొనబడును. No Brokers. 9553973999 / 6303049720.
NT-326614

CHANGE OF NAME

★ Kasarapu Bhoom Reddy S/o. Kasarapu Deva Reddy (Old Name) H.No. 1-15/1, Konaipally, Vemulawada mandal, Rajanna Sircilla Dist. my Father name was changed to KASARAPU BHOOM REDDY, S/o. KASARAPU DEVAIAH (New Name)
NTK-00000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571
9182 777 189

ఆర్‌ఎంపీల ఇష్టారాజ్యం!

తిమ్మాపూర్‌లో అధికారులు సీజ్ చేసిన క్లినిక్ ఇదే

- పల్లెల్లో మెడికల్ ప్రాక్టిషనర్స్‌పై విమర్శలు
- యథేచ్ఛగా నిబంధనలకు నీళ్లు.. అడ్డంగా దోపిడీ
- ప్రాథమిక చికిత్స మాటున అచ్చీరాని వైద్యం
- పలు సందర్భాల్లో కొందరికి వైద్యం వికటించి ప్రాణాలమీదికి వచ్చినా మారని తీరు
- తాజాగా తుర్క కాశీపల్లిలో మహిళ మృతిపై అనుమానాలు
- ఆర్‌ఎంపీ చికిత్స వికటించే మృతిచెందిందని భర్త ఫిర్యాదు

ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 28: గ్రామీణ ప్రజలకు ఆపద సమయాల్లో ప్రాథమిక చికిత్స అందిస్తూ దైవంలా మారిన ఆర్‌ఎంపీ వ్యవస్థ కట్టు తప్పుతున్నది. సేవాభావం నుంచి తప్పుకుని సంపాదనే మార్గంగా అడ్డదారుల్లో వెళ్తున్నది. ప్రాథమిక వైద్యం మాత్రమే చేయాల్సిన ఆర్‌ఎంపీ, పీఎంపీలు కొందరు పరిధి దాటి ముందుకెళ్తున్నారు. యథేచ్ఛగా నిబంధనలు విస్మరిస్తూ అచ్చీరాని వైద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రజలకు ప్రాథమిక వైద్యం మాత్రమే చేయాల్సి ఉంటుంది. ఇంజక్షన్ కూడా ఇవ్వరాదు. కానీ ఇందులో మెజార్టీ ప్రాక్టిషనర్స్ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. డైరెక్ట్‌గా వైద్యమే చేస్తున్నారు. గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా సొంతంగా క్లినిక్‌లు, మెడికల్ దుకాణాలు ఏర్పాటు చేసుకొని అటు వైద్యం చేస్తూ, ఇటు మందులు రాసుకుంటూ అందిన కాడికి దోచుకుంటున్నారు. అంతే కాదు భారీ కమీషన్ల కోసం అవసరం లేకున్నా పేషంట్లను రిఫరల్ కేసులుగా కార్పొరేట్ హాస్పిటల్‌కు పంపుతున్నారనే విమర్శలు ఉన్నాయి. అయితే ఆర్‌ఎంపీల వైద్యంతో మండలంలో పలువురు ప్రాణాలమీదికి తెచ్చుకుంటున్న ఘటనలూ ఉన్నాయి. ఇటీవల పలు గ్రామాల్లో మరణాలకు పలువురు ఆర్‌ఎంపీల అచ్చిరాని వైద్యమే కారణమన్న పోస్టులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడం, పలు పత్రికల్లో కథనాలు వచ్చిన విషయం తెలిసిందే. అయితే ఇంత జరుగుతున్నా వైద్యాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, కనీసం హెచ్చరికలు జారీ చేసిన పాపాన పోవడం లేదని, ఇదేం తీరు అని మండల ప్రజలు మండిపడుతున్నారు.

ప్రాణాలమీదికి వస్తున్నా మారని తీరు

గత సెప్టెంబర్ 14న మండల కేంద్రంలో ఉంటున్న ఓ చిన్నారికి తీవ్ర జ్వరం రాగా, తల్లిదండ్రులు స్థానికంగా ఉన్న ఓ ఆర్‌ఎంపీ వద్ద చికిత్స అందించారు. అయినప్పటికీ తగ్గకపోవడంతో మరోసారి అదే ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లగా, అతను సెలైన్ ఎక్కించడంతో తీవ్ర అస్వస్థతకు గురైంది. హైదరాబాద్‌లోని కార్పొరేట్ దవాఖానకు తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ మృతిచెందడం అప్పట్లో సంచలనం రేపింది. మరో ఘటనలో గుండారానికి చెందిన ఓ బాలుడికి గత సెప్టెంబర్ 17న తీవ్ర జ్వరం రాగా, బాలుడి తండ్రి ఓ ఆర్‌ఎంపీ వైద్యుడి వద్ద చికిత్స అందించాడు. జ్వరం తగ్గకపోవడంతో మరో రోజు అదే ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లాడు. సెలైన్ పెట్టిన తర్వాత చలిజ్వరం వచ్చింది. బాలుడిని మెరుగైన చికిత్స కోసం కరీంనగర్, ఆ తర్వాత హైదరాబాద్‌లోని కార్పొరేట్ దవాఖానకు తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. ఆర్‌ఎంపీ చికిత్స వల్లే మృతి చెందాడని విలేజ్ సోషల్ మీడియా గ్రూపుల్లో పెట్టిన పోస్టు వైరల్ అయింది. ఈ రెండు ఘటనలే కాదు తాజాగా గంభీరావుపేట మండలం తుర్కకాశీనగర్‌కు చెందిన మహిళ షేక్ కాసింబీ(30) తీవ్ర జ్వరంతో బాధపడుతూ ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్‌లోని ఓ ఆర్‌ఎంపీ వద్దకు వెళ్లింది. ట్రీట్‌మెంట్ తీసుకున్న తర్వాత అపస్మారక స్థితికి చేరుకుంది. దీంతో బాధితురాలిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందించగా, పరిస్థితి విషమించి మృతిచెందింది. అయితే ఆర్‌ఎంపీ ట్రీట్‌మెంట్ వికటించిందా..? లేక అప్పటికే బాధితురాలి పరిస్థితి విషమించి చనిపోయిందా..? అని అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఆర్‌ఎంపీలు పరిధి దాటొద్దు

ఆర్‌ఎంపీ వైద్యులు పరిధిని దాటి వైద్యం చేయొద్దు. కేవలం వారికి అనుమతించిన పారాసిటమోల్, బీకాంప్లెక్స్ గోలీలను మాత్రమే ఇవ్వాలి. నేను ఇటీవలే బాధ్యతలు తీసుకున్నా. ఇలాంటి ఘటనలపై వివరాలిస్తే సమాచారం సేకరించి బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. ఖాసింబీ మృతి విషయంలో మా సిబ్బంది వివరాలు సేకరించారు. క్లినిక్‌ను తనిఖీ చేసి సీజ్ చేశారు.

- రజిత, డీఎంహెచ్‌వో, సిరిసిల్ల.

ఖాసింబీ ఇంజక్షన్ వికటించే మృతి చెందింది

- ఆర్‌ఎంపీపై భర్త ఫిర్యాదు
- ఎల్లారెడ్డిపేటలో కేసు నమోదు

ఖాసింబీ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట/గంభీరావుపేట, డిసెంబర్ 28: ఆర్‌ఎంపీ వైద్యుడు ఇచ్చిన ఇంజక్షన్ వికటించి తన భార్య మృతి చెందిందని భర్త అజీమ్ ఠాణాలో ఫిర్యాదు చేయగా, వైద్యుడిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ కే. చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 26న గంభీరావుపే మండలం సముద్రలింగాపూర్ అనుబంధ గ్రామం తుర్కాషిపల్లెకు చెందిన షేక్ ఖాసింబీ(30)కి జ్వరం రావడంతో తిమ్మాపూర్‌కు చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు జెజ్జెరి దేవేందర్ వద్దకు చికిత్స కోసం తీసుకెళ్లారు. అతను రెండు ఇంజక్షన్లను ఇచ్చి పంపించాడు. తిరిగి 27న సాయంత్రం అదే ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లగా, చిన్న సైజు సెలైన్, ఆ వెంటనే పెద్ద సెలైన్‌లో ఇంజక్షన్ చేసి పెట్టాడు. ఆ కొద్దిసేపటికే ఆమె పరిస్థితి విషమంగా మారడంతో ఎల్లారెడ్డిపేటలోని దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ శనివారం తెల్లవారు జామున మృతి చెందింది. ఆర్‌ఎంపీ ఇచ్చిన ఇంజక్షన్, సెలైన్ వికటించి తన భార్య మృతిచెందిందని భర్త అజీమ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

ఆర్‌ఎంపీ క్లినిక్ సీజ్

తిమ్మాపూర్‌లో దేవేందర్ క్లినిక్‌లో వైద్యాధికారులు

ఆర్‌ఎంపీ దేవేందర్ ఇచ్చిన వైద్యం వికటించి తన భార్య ఖాసింబీ మృతి చెందిదనే భర్త ఠాణాలో ఫిర్యాదు చేయడం, ఈ ఘటన సోషల్‌మీడియాలో వైరల్‌గా మారడంతో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు డిప్యూటీ డీఎంహెచ్‌వో ఏంజెలా ఆల్ఫ్రెడ్ తిమ్మాపూర్‌లోని దుర్గా క్లినిక్‌ను సందర్శించారు. సీజ్ చేశారు. ఆమెతో లింగన్నపేట వైద్యాధికారి అభినయ్, సిబ్బంది ఉన్నారు.

ఎల్లారెడ్డిపేటలో షార్ట్ సర్క్యూట్

షాట్ సర్క్యూట్‌తో కాలిపోయిన పరికరాలు

ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 28: మండల కేంద్రంలోని కొత్త బస్టాండు ప్రాంతంలో షార్ట్ సర్క్యూట్‌తో పలు దుకాణాల్లో ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయిన ఘటన శనివారం జరిగింది. దుర్గా ఫ్లెక్సీ ప్రింటర్స్‌లో రూ.లక్ష విలువ చేసే కంప్యూటర్లు, చిన్న ప్రింటర్లు, సీసీ కెమెరాలు, రెండు సీపీయూలు, రెండు మానిటర్లు, పెద్ద ఫొటో ప్రింటర్ కాలిపోయింది. షార్ట్ సర్క్యూట్ ఘటనలు తరచూ జరుగుతున్నాయని, లక్షలాది రూపాయల విలువ చేసే పరికరాలు కాలిపోతున్నాయని, సెస్ అధికారులు సమస్యను పరిష్కరించాలని గృహ వినియోగదారులతో పాటు దుకాణందారులు కోరుతున్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే కేసులు

రుద్రంగి, డిసెంబర్ 28: మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే తల్లిదండ్రులు, వాహన యజమానులపై కేసులు నమోదవుతాయని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18న రుద్రంగిలోని బస్టాండ్ సమీపంలో రెండు బైక్‌లు ఢీకొనడంతో కంటె రాములు(70) మృతిచెందగా, మైనర్‌కు బైక్ ఇచ్చిన తల్లిపై కేసు నమోదు చేసి, గతంలోనే రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. అలాగే శనివారం బాలుడిని జిల్లా ప్రొబేషనరీ అధికారి, జువెనైల్ బోర్డు ఎదుట ప్రవేశపెట్టి, జువెనైల్ బోర్డు చైర్మన్ ఆదేశాలతో జువెనైల్ హోమ్‌కు తరలించినట్లు వివరించారు. జిల్లాలో మైనర్ల డ్రైవింగ్‌పై తరచూ స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామని, మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే తల్లిదండ్రులు, వాహన యజమానులే బాధ్యతులవుతారని, అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి రజిత

ఆరోగ్య కేంద్రం తనిఖీ

సిరిసిల్ల టౌన్, డిసెంబర్ 28: అంబేద్కర్‌నగర్‌లోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రజిత శనివారం తనిఖీ చేశారు. కేంద్ర ఆరోగ్య పథకాలపై సమీక్ష నిర్వహించి లక్ష్యాలు సాధించాలని దిశానిర్దేశం చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఇక్కడ వైద్యాధికారి కృష్ణవేణి తదితరులు ఉన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- ఇరిగేషన్ ఏఈ భాస్కర్‌రెడ్డి
- 'చెర'లో చెరువులు కథనానికి స్పందన
- త్వరలోనే చెరువు హద్దుల నిర్ధారణ

గొల్లపల్లి సంఘం చెరువు వద్ద రైతుతో మాట్లాడుతున్న ఏఈ భాస్కర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 28: పట్టా ఉందనే సాకుతో ఏక్ ఫసల్ నిబంధనలను ఉల్లంఘించి ఎత్తయిన మడులు కట్టి సేద్యం చేస్తే చట్టపరమైన చర్యలుంటాయని నీటి పారుదల శాఖ ఏఈ భాస్కర్‌రెడ్డి హెచ్చరించారు. రెండ్రోజుల క్రితం 'చెర'లో చెరువులు పేరిట 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు ఏఈ భాస్కర్‌రెడ్డి శనివారం క్షేత్రస్థాయిలో చెరువును పరిశీలించారు. చెరువులో మడులు కట్టిన మర్రి నారాయణరెడ్డిని పిలిచి ఇక్కడ ఎలాంటి సాగు పనులు చేయరాదని సూచించారు. అలాగే సంగం చెరువు మత్తడిని పరిశీలించారు. అక్కడ పొలం చేసిన రైతులకు సమాచారం అందించగా, వారెవరూ అందుబాటులో లేరని చెప్పారు. త్వరలోనే రెవెన్యూ అధికారులతో కలిసి హద్దులను నిర్ణయించి చెరువు పరిరక్షణకు తగిన చర్యలు తీసుకుంటామని ఏఈ తెలిపారు.

క్రీడలతో స్నేహభావం పెరుగుతుంది

కోరెంలో ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ట్రస్టు చైర్‌పర్సన్ చెన్నాడి రాజ్యలక్ష్మి

బోయినపల్లి, డిసెంబర్ 28: క్రీడలతో స్నేహభావం పెరుగుతుందని మార్తండరావు మెమోరియల్ ట్రస్టు చైర్ పర్సన్ చెన్నాడి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. కోరెంలో చెన్నాడి మార్తండ రావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడలను ఆమె ప్రారంభించి, మాట్లాడారు. మార్తాండరావు ట్రస్టు ఆధ్వర్యంలో క్రీడల నిర్వహణే కాదు ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకుని ఏటా నోట్ బుక్కుల, బ్యాగులు ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. ఇక్కడ ఉమ్మడి జిల్లా బీఆర్‌ఎస్ నాయకులు చెన్నాడి అమిత్‌కుమార్, చెన్నాడి రాము, ప్రతిమ పీఆర్‌వో జోగినపల్లి సంపత్‌రావు, మాజీ ఎంపీటీసీ డబ్బు మమత, మాజీ ఉప సర్పంచ్ గాజర్ల రోహిణి ఉన్నారు.

పీటీఐ వస్తు ప్రదర్శనతో నిరసన

కలెక్టరేట్ వద్ద పీటీఐ వస్తువులతో నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

కలెక్టరేట్, డిసెంబర్ 28: పాఠశాలలో విద్యార్థులకు నైపుణ్యాలు పెంపొందించేలా పీటీఐలు తయారు చేసిన వస్తువులతో సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరసన తెలిపారు. కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్షలు శనివారం 19వ రోజుకు చేరాయి. ఇకనైనా ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. ఉద్యోగుల దీక్షకు శనివారం ఎస్టీయూ యూనియన్ బాధ్యులు మధుసూదన్ రావు, రమణారెడ్డి, బీజేపీ నాయకులు రఘునాథరావు, బీసీ జనసభ ఓయూ ఫౌండర్ రాజారాం యాదవ్, నాయకులు ఆకుల స్వామి, మేకల కృష్ణ యాదవ్ కలిసి సంఘీభావాన్ని తెలిపారు.

కాంగ్రెస్ నేతపై కేసు

- 'నమస్తే తెలంగాణ' ఎఫెక్ట్

సిరిసిల్ల రూరల్, డిసెంబర్ 28: ప్రేమ పెండ్లి చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఓ యువకుడిని డబ్బులు డిమాండ్ చేసి బెదిరించిన ఘటనలో కాంగ్రెస్ నేతపై పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం కాంగ్రెస్ నేత.. మళ్లీ పైసా వసూల్?' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితం కాగా, పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీకి చెందిన గడ్డం మధుకర్ అలియాస్ చోటుపై కేసు నమోదు చేసినట్లు తంగళ్లపల్లి ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు. రెండ్రోజుల కింద ఇందిరమ్మ కాలనీకి చెందిన పోల నవీన్ యువతిని ప్రేమ పెండ్లి చేసుకున్నాడు. పోలీసులను ఆశ్రయించగా, తనకు పోలీసులు తెలుసంటూ, తాను మాట్లాడుతానని కాంగ్రెస్ నేత మధుకర్ పోలీస్‌స్టేషన్‌లోనే యువకుడిని డబ్బులు డిమాండ్ చేశాడు. నవీన్ తన స్నేహితులకు విషయం చెప్పగా, వారు వచ్చి సదరు కాంగ్రెస్ నేతను నిలదీయడం, ఈ విషయం సామాజిక మధ్యమాల్లో వైరల్ అయిన విషయం తెలిసిందే. అయితే మధుకర్ తనతో పోలీసులకు డబ్బులు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పి రూ.15 వేలు డిమాండ్ చేయడంతోపాటు బెదిరించాడని నవీన్ శనివారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నిధులు మంజూరు చేయాలి

గంభీరావుపేట, డిసెంబర్ 28: రాజేశ్వర్‌రావునగర్‌లో శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ గ్రామస్తులు కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు శనివారం శనివారం వినతి పత్రం అందజేశారు. ఆలయానికి ప్రహరీతో పాటు రెండు హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు నిధులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు యెలెందర్, పిట్ల బాబు, శంకర్‌డ్డి, అల్లెపు బాబు తదితరులు ఉన్నారు.

పంట పొలాల సందర్శన

కోనరావుపేట, డిసెంబర్ 28: మామిడిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల 8,9,10వ తరగతి విద్యార్థులు శనివారం పంట పొలాలు సందర్శించారు. క్షేత్ర సందర్శనలో భాగంగా విద్యార్థులను ఉపాధ్యాయులు వ్యవసాయ క్షేత్రాలకు తీసుకువెళ్లి అవగాహన కల్పించారు. ఆధునిక పద్ధతులతో వ్యవసాయాన్ని చేయడంతో పాటు పంట మార్పిడి, మిశ్రమ పంటలు, సంక్రమించే తెగుళ్లపై ప్రత్యక్షంగా వివరించారు. అనంతరం విద్యార్థులు కూలీలతో కలిసి వరి నాట్లు వేశారు. ఇక్కడ హెచ్‌ఎం కస్తూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

30న ఓటరు తుది జాబితా ప్రకటిస్తాం

వేములవాడ రూరల్, డిసెంబర్ 28: పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు తుది జాబితాను సోమవారం ప్రకటిస్తామని ఆర్డీవో రాజేశ్వర్ పేర్కొన్నారు. శనివారం వేములవాడ తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించి, మాట్లాడారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ ఓటరు నమోదు జాబితాను జనవరి 6న ప్రకటిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేశ్, రాజకీయ పార్టీల నాయకులు పొలాస నరేందర్, నిత్యనందరావు, రాము, పిన్నింటి హన్మాండ్లు, రామస్వామిగౌడ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

కేజ్‌వీల్స్‌కు ఢీకొని యువకుడి మృతి

ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 28: ఎదురుగా వెళ్తున్న ట్రాక్టర్‌కు తగిలించి ఉన్న కేజీవీల్‌ను బైక్‌తో ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన ఘటన శనివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం ఆవునూరుకు చెందిన ఓ ట్రాక్టర్ డ్రైవర్ పదిరలో పొలం దున్ని కేజ్‌వీల్స్‌ను ట్రాక్టర్ వెనుక తగిలించుకుని వెంకటాపూర్ వైపు వెళ్తున్నాడు. చింతలఠాణాకు చెందిన యువకుడు గోకులకొండ రాజేశ్(36) బైక్‌పై ట్రాక్టర్ వెనుక వస్తూ కేజ్‌వీల్స్‌కు ఢీకొట్టి, అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది.

పొలానికి నీళ్లు పెట్టి వస్తూ..

- ఎల్లారెడ్డిపేటలో విద్యుదాఘాతంతో రైతు మృతి

ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 28: మండల కేంద్రానికి చెందిన రైతు ఎడ్ల నర్సయ్య(60) తన పొలంలో విద్యుదాఘాతంతో మృతి చెందాడు. స్థానికులు అందించిన వివరాల ప్రకారం.. ఎడ్ల నర్సయ్య శనివారం పొలానికి నీళ్లు పెట్టి తిరిగి వస్తున్న క్రమంలో కరెంట్ పాస్ అవుతున్న ఎర్త్ వైర్ తగిలింది. అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

పోరాట యోధుడు బద్దం ఎల్లారెడ్డి

వేములవాడ, డిసెంబర్ 28: దున్నేవాడిదే భూమి అని, వారికే హక్కులు ఉండాలని పేదల కోసం కొట్లాడిన పోరాట యోధుడు బద్దం ఎల్లారెడ్డి అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కడారి రాములు కొనియాడారు. శనివారం ఆయన 45వ వర్ధంతి సందర్భంగా వేములవాడలోని అమరవీరుల స్తూపం వద్ద చిత్రపటం ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నాయకత్వం వహించిన ఎల్లారెడ్డి, చట్టసభల్లో కూడా పేద ప్రజల పక్షాన కొట్లాడారని గుర్తు చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఆయన పోరాటాలు ఇప్పటికీ చిరస్థాయిలో నిలిచిపోతాయన్నారు. కార్యక్రమంలో పట్టణ సీపీఐ కార్యదర్శి గాజుల పోశెట్టి, నాయకులు దేవరాజు, నరసయ్య, కోరేపు క్రాంతి, శ్రీనివాస్, మల్లయ్య, శ్రీనివాస్ ఉన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

చందుర్తి, డిసెంబర్ 28: గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని చందుర్తి తహసీల్దార్ గ్రామ ప్రత్యేకాధికారి శ్రీనివాస్ సూచించారు. బండపల్లి కిష్టంపేట గ్రామంలో శనివారం గ్రామ సభను నిర్వహించి, మాట్లాడారు. గ్రామాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, విష జ్వరాలు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నర్సరీలో పండ్ల మొక్కలు పెంచాలని సూచించారు. గ్రామాల్లో నూతన పనుల కోసం స్థానికుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ పంచాయతీ కార్యదర్శి రమేశ్‌బాబు, ఉద్యోగులు ఉన్నారు.

ఒకరి రక్తదానం

వేములవాడ, డిసెంబర్ 28: రక్తహీనతతో బాధపడుతూ, దవాఖానలో చికిత్స పొందుతున్న మహిళకు చిరు ఫాన్స్ శనివారం రక్తదానం చేశారు. వైద్యుల సలహా మేరకు బీ పాజిటివ్ రక్తం అవసరమని సూచించడంతో సింహాచలం హరికృష్ణ రక్తదానం చేశారని చిరంజీవి రాష్ట్ర యువత విభాగం నాయకులు, మాజీ ధర్మకర్త అరుణ్ తేజా చారి తెలిపారు.

ఎమ్మార్పీఎస్ కార్యాలయం ఏర్పాటు

చందుర్తి, డిసెంబర్ 28: మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల కార్యాలయాన్ని శనివారం ఆ పార్టీ మండలాధ్యక్షుడు శంకరయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని చెప్పి హామీ ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోజులు గడుస్తున్నా ఎందుకు కాలయాపన చేస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. కార్యాచరణ ఎప్పుడు మొదలు పెడతారో చెప్పాలన్నారు. మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా మరో పోరాటానికి మాదిగలంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇక్కడ రాష్ట్ర నాయకులు తామస్, ఆవు నూరి ప్రభాకర్, జిల్లా కన్వీనర్ ఎలగందల బిక్షపతి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కానాపురం లక్ష్మణ్, దుమ్మ అంజయ్య, లింగంపల్లి బాబు, లింగంపల్లి వెంకటి, అర్జున్, తదితరులు ఉన్నారు.